## క్లుప్తంగా

### నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మంటపంలో వలంటీర్లు, యానిమేటర్లు, స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు యానిమేటర్లతో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ శనివారం సమావేశం అవుతారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తెలిపారు.

### అయోధ్యలో వాల్మీకి మందిరం నిర్మిస్తాం



మాజీ సీఎం బసవరాజ్ బొమ్మైని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: అయోధ్యలో మహర్షి వాల్మీకి మందిరాన్ని తప్పక నిర్మిస్తామని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బసవరాజు బొమ్మై తెలిపారు. దావణగెరె జిల్లా హరిహర తాలూకా రాజనహళ్లి గ్రామంలోని మహర్షి వాల్మీకి గురుపీఠంలో శుక్రవారం నిర్వహించిన జాతరోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగితో వాల్మీకి మందిర నిర్మాణంపై చర్చలు జరిపామన్నారు. త్వరలోనే రామాయణంలోని 2 వేల శ్లోకలకాలను లిఖించి పెద్ద ఎత్తున్న వాల్మీకి మందిరాన్ని అయోధ్యలో నిర్మిస్తామన్నారు. విధాన సభ ప్రతి పక్ష నాయకుడు ఆర్ అశోక్, రాజుగౌడ తదితరులు పాల్గొన్నారు.

### పాపం పసివాడు !



చికిత్స పొందుతున్న బాలుడు

పావగడ: పట్టణంలోని ఆర్‌జే సర్కిల్ వద్ద ఫుట్‌పాత్‌పై ఏడాదిన్నర వయస్సున్న బాలుడిని తల్లిదండ్రులు వదిలేసి వెళ్లారు. గురువారం రాత్రి సమాచారం అందుకున్న ప్రభుత్వాస్పత్రి సిబ్బంది ఆ పసివాడిని ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స అందించారు. అనంతరం సీడీపీఓ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రికెళ్లి అతని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడి తల్లిదండ్రుల ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఎస్‌ఐ గురునాథ్ తెలిపారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్



జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అమరాపురం: మండలంలోని గౌడనకుంట గ్రామ శివారులోని బహిరంగ ప్రదేశంలో శుక్రవారం ఉదయం పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసి రూ.30,100 నగదు, 12 ద్విచక్ర వాహనాలు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో మంగపత్తా ఆడుతూ 12 మంది పట్టుబడ్డారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

### పాడి రైతులు బీమా చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీడీ సత్యప్రకాష్

పెనుకొండ: పాడి రైతులు బీమా చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ డీడీ సత్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశువులు అనారోగ్యంతో కాని, ప్రమాదాల్లో కాని మరణిస్తే రైతులు ఎంతో నష్టపోతారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు పశు బీమా చేయించుకునే సౌకర్యం కల్పించిందన్నారు. రైతులు వారి పరిధిలోని ఆర్బీకేల్లో అధికారులను కలసి బీమాను వెంటనే చేయించుకోవాలన్నారు.

### వర్షపు నీటి ప్రాముఖ్యతపై అవగాహన

గుడిబండ: పట్టణంలోని ఎఫ్‌పీఓ కార్యాలయంలో శుక్రవారం వర్షపు నీటి ప్రాముఖ్యతపై రైతు సంఘాలకు అవగాహన కల్పించారు. ఏపీ మాస్ డైరెక్టర్ గోపాల్‌రాజ్ మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం, నిలువ చేసుకొన్న నీటిని ఏవిధంగా వినియోగించుకోవాలన్నదానిపై రైతులకు పలు సూచనలు తెలిపారు.

### క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్ అనంతపురం ఆర్డీటీ రీజినల్ కార్యాలయంలో శుక్రవారం 5వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీ మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు పోటీ పరీక్షల్లోనూ రాణించాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన కల్లుమర్రి క్లస్టర్ విద్యార్థులు, ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లెడుగుంట క్లస్టర్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# రెచ్చిపోతున్న బైక్ రైడర్లు



- పెనుకొండ ప్రాంతంలో హల్‌చల్
- హైవే నుంచి కొండపైకి అతివేగంగా వెళ్తున్న వైనం
- వీకెండ్ వచ్చిందంటే ప్రజలు బెంబేలు



కొండపై ఫొటోలు తీసుకుంటున్న బైక్ రైడర్లు

పెనుకొండ: పెనుకొండలో పర్యాటకం ప్రాణ సంకటంగా మారుతోంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ముఖ్యంగా పట్టణంలోని కొండ రోడ్డును ఎంతో అందంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ మధ్య పర్యాటకుల తాకిడి కూడా పెరిగింది. అయితే కొందరు బైక్ రైడర్లు మాత్రం పర్యాటక ప్రాంతంలో హల్‌చల్ చేస్తుండటంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

**శనివారం వస్తే చాలు..**

శని, ఆదివారాలు వస్తే చాలు బైక్ రైడర్లు వివిధ స్పోర్ట్స్ బైక్స్‌పై అతివేగంగా నడుపుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. వివిధ రకాల శబ్దాలు వచ్చేలా బైక్‌లకు పరికరాలను అమర్చుకొని హల్‌చల్ చేస్తున్నారు. బైక్‌లను నేలకు తాకించే విధంగా వాహనాలను నడిపిస్తూ కంటికి కనిపించనంత వేగంతో బెంగళూరు నుంచి హైవే మీదుగా కొండపైకి చేరుకుంటున్నారు. విపరీతమైన మలుపులు ఉన్న కొండ రోడ్డులో ఏ క్షణానికి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు, పర్యాటకులు ఆందోళనకు గురవుతున్నారు. రోజురోజుకు బెంగళూరు నుంచి పెనుకొండకు వస్తున్న పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. బైక్ రైడర్లు సైతం వందల సంఖ్యలో రావడం జరుగుతోంది. దీంతో కొండపై వారాంతంలో సందడిగా మారింది. ప్రధానంగా యాడ్ ఫిల్మ్‌లు, షూటింగ్‌లు సైతం ఇక్కడ జరుగుతున్నాయి. పర్యాటకంగా మంచిదే అయినా బైక్ రైడర్ల తాకిడితో ఎప్పుడు ఎవరి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయో తెలీని పరిస్థితి నెలకొంది.

**20 అడుగుల పైనుంచి కిందకు...**

ఇటీవల బెంగళూరుకు చెందిన దినేష్ అనే ఓ బైక్ రేసర్ ద్విచక్ర వాహనంలో అత్యంత వేగంతో వస్తూ 20 అడుగుల ఎత్తులో నుంచి లోయ లాంటి ప్రాంతంలోకి పడిపోయాడు. ప్రాణాపాయస్థితిలో ఉన్న యువకుడిని తోటి స్నేహితులు హుటాహుటిన బెంగళూరుకు తరలించారు. ఇలాంటి ఘటనలు ఉత్పన్నం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

**పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు తప్పదా?**

పెనుకొండ కొండకు వెళ్లే రహదారిలోనా, కొండపై భాగంలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తే మంచిదన్న భావన పర్యాటకుల్లో వ్యక్తమవుతోంది. బైక్ రైడర్ల సందడి అధికంగా ఉండటం, నూతన వ్యక్తులు ఇతర ప్రాంతాల నుంచి భారీగా వస్తుండటంతో శని, ఆది వారాల్లో ఔట్‌పోస్ట్ వద్ద పోలీసులు విధులు నిర్వహిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని పలువురు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో పెనుకొండ పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే పోలీసులు ఈ ప్రాంతం వైపు దృష్టి సారించాలని చెబుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం**



పెనుకొండ కొండకు వెళ్లే రహదారిలో వారాంతంలో పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి అక్కడ సిబ్బందిని నియమించి విధులు నిర్వర్తిస్తాము. పర్యాటకులు, ప్రజలను ఇబ్బంది పెట్టేవిధంగా బైక్ రైడర్లు విన్యాసాలు చేయడం , వేగంగా బైక్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. పర్యాటకంగా పెనుకొండ అభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుంది. కొండపైనా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూస్తాము.

– రాజేష్, ఎస్‌ఐ

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని 11 కేవీ లైన్ మరమ్మతు కారణంగా శనివారం శాంతినగర్, త్యాగరాజనగర్, గుడ్డం, చైతన్యనగర్, సాయినగర్, పోలీస్ క్వార్టర్స్, ఆర్టీసీ కాలనీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

### ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ప్రసాద్

రొళ్ల: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ప్రసాద్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నతాధికారులు బాధ్యతలు అప్పగించినట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు. రెగ్యులర్ ఎంపీడీఓ విధుల్లోకి చేరే వరకు ప్రసాద్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

### పాఠశాలలో వంట పాత్రల అపహరణ

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి దుండగులు వంట పాత్రలను అపహరించినట్లు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న ఇనుప తలుపులను కోసివేసి వంట పాత్రలను దొంగిలించారని చెప్పారు. మరమ్మతు కారణంగా ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన వంట పాత్రలు కూడా ఇక్కడే ఉండేవని, వాటిని కూడా దొంగలు ఎత్తుకెళ్లారన్నారు. అపహరణకు గురైన వంట పాత్రల విలువ రూ.35 ఉంటుందని తెలిపారు.

## జగనన్నతోనే అన్ని వర్గాలకూ న్యాయం



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్, చిత్రంలో బోయ శాంతమ్మ తదితరులు

- మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ న్యాయం జరిగింది. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. సంక్షేమాభివృద్ధి ప్రదాత అయిన మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందాం' అని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీరప్పస్వామి ఆలయ కల్యాణ మంటపంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హిందూపురం పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్న సమావేశంలో మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటూ ఇవ్వని అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి ప్రజలను మోసగించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌తో పాటూ పచ్చ నేతలు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌తో కలిసి వస్తున్నారన్నారు. కేవలం అధికారం కోసమే చంద్రబాబు అండ్ కో ఆరాటపడుతున్నారే తప్ప ప్రజల సమస్యలను పరిష్కరించడంతో వారికి చిత్తశుద్ధ లేదని విమర్శించారు.

**సమష్టిగా పనిచేయాలి**

రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ప్రజాప్రతినిధులతో కలిసి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, జెడ్పీటీసీ శ్రీరామప్ప, మాజీ కన్వీనర్ జయరాం, వైస్ ఎంపీపీ వేదవతి నరసింహారెడ్డి, పెనుకొండ కౌన్సిలర్ పుష్పం సుధాకర్‌రెడ్డి, ఈదుల బలాపురం నాగభూషణరెడ్డి, సింగారెడ్డి, రెడ్డిపల్లి విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం మైనార్టీ నాయకుడు మున్నా ఇంటికి వెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

## వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



పాప్పనపల్లి తండాలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: 'అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ ఫలాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలి' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాలసముద్రం పంచాయితీ పరిధిలోని మిషన్‌తండా, కొత్తూరు, పాప్పనపల్లితండా, బెల్లాలచెరువు, కాటేపల్లి రాగిమాకులపల్లి, సామలపల్లి గ్రామాల్లో శుక్రవారం సర్పంచ్ చిన్న గంగప్ప ఆధ్వర్యంలో చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

### చేనేతల సంక్షేమానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి: నష్టాల ఊబిలో కూరుకుపోతున్న చేనేతలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవ స్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన సోమందేపల్లిలో చేనేత సంఘం జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం ధర్మవరంలో ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో చేనేతల కోసం రూ.25 వేల కోట్లు కేటాయించాలని కోరారు. అనంతరం చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పోలా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, నాయకులు నాగేశ్వరరావు, జింక చలపతి, రమణ, బాలస్వామి, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

### మద్దతు ధరతో కందుల కొనుగోలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం మండలి చైర్మన్ ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏడీ అల్తాఫ్ అలీఖాన్ మాట్లాడుతూ ఈ క్రాప్, ఈ–కేవైసీ ఈనెల 15వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. కందులు, రాగుల కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచులు ఆదినారాయణ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయమని పనిచేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. ప్రజలు వైఎస్సార్‌సీపీ పక్షాన ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ గాలి వీస్తోందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, బేకరినాగరాజు, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, కౌన్సిలర్లు బలరామ్, రమేష్, సతీష్‌రెడ్డి, సిద్ధప్ప, సుధాకర్‌నాయక్, లక్ష్మయ్య, సత్యనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**లక్కప్పను సన్మానించిన మున్సిపల్ సిబ్బంది**

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్పను మున్సిపల్ సిబ్బంది సన్మానించారు. మున్సిపాలిటీలోని సమస్యలను తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఈర లక్కప్ప తెలిపారు. ఏఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

**నేటి నుంచి ఎన్నికల ప్రచారం**

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లు గ్రామం నుంచి శనివారం వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. తొలిత ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోజు ఐదు పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

### టీడీపీలో లుకలుకలు

- జయహో బీసీ సదస్సుకు ముఖ్యనేతల గైర్హాజరు

పెనుకొండ: పెనుకొండ టీడీపీలో మరోసారి లుకలుకలు బయట పడ్డాయి. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి ఇంటి వద్ద జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ కురుబ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సవితమ్మ, పెనుకొండ మాజీ కన్వీనర్ శ్రీరాంయాదవ్, అడదాకులపల్లికి చెందిన మాజీ సర్పంచ్ దండు ప్రసాద్, కురుబవాండ్లపల్లికి చెందిన సోమశేఖర్, ఆయన సోదరుడు త్రివేంద్ర, సోమందేపల్లి, పరిగికి చెందిన మాజీ జెడ్పీటీసీలు ఉప్పర వెంకటరమణ, బోయ సూర్యనారాయణ, సోమందేపల్లి మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు డీవీ.ఆంజనేయులు, రొద్దంకు చెందిన ఆంజనేయులు ఇతర ముఖ్య నేతలు సమావేశానికి గైర్హాజరయ్యారు. బలమైన నాయకులను జిల్లా అధ్యక్షుడే దూరం పెడుతుంటే త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ ఎలా గెలుస్తుందని ఆ పార్టీ నాయకులే ప్రశ్నిస్తున్నారు. ఒంటెద్దుపోకడ రాజకీయాలు అధికం కావడం వల్లే రోజురోజుకు పార్టీ బలహీనపడుతోందని వాపోతున్నారు.



మడకశిర మండలం గౌడనహళ్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి



హిందూపురం: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారిణి మంజుశ్రీ

### ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



పరిగి: ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్ స్వరూపరెడ్డి, సీహెచ్‌ఓ వన్నప్ప

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్ పెట్టొచ్చని వైద్యులు తెలిపారు.

## చుట్టపు చూపు ఎమ్మెల్యే బాలకృష్ణ



హిందూపురం: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ప్రజాప్రతినిధులు



చిలమత్తూరు: మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి



లేపాక్షి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి

- ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

హిందూపురం: 'నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం ఎమ్మెల్యే బాధ్యత. ఓటేసి గెలిపించిన పాపానికి ప్రజలను గాలికి వదిలేసి ఎన్నికల వచ్చాయని ఇప్పుడు వచ్చి రెండు పనులు పూజలు చేసి అభివృద్ధి చేశానని ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పుకోవడం సిగ్గుచేటు' అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్‌చైర్మన్లు బలరాంరెడ్డి, జబీవుల్లా, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, మధుమతిరెడ్డి విమర్శించారు. శుక్రవారం హిందూపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో చేసిన పర్యాటనను చూసి భయపడి ఎక్కడ ఓడిపోతానని భయపడి ఎమ్మెల్యే బాలకృష్ణ కుటుంబంతో సహా వచ్చిపోతున్నారని విమర్శించారు. ఒక కౌన్సిలర్‌ను ప్రలోభపెట్టి తమవైపుకు తీసుకున్నారేగాని ఒక్క సరైన వైఎస్సార్ కార్యకర్త కూడా అటు పక్క చూడరని స్పష్టం చేశారు. 20వ వార్డులో రూ.1,69,34,212 వివిధ కార్యక్రమాల ద్వారా సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. కొత్తగా 300 మీటర్ల వాటర్ పైప్‌లైన్ కూడా వేయించామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ గెలిచినప్పటి నుంచి లేపాక్షి మండలానికి చుట్టపు చూపుగా వస్తున్నారే తప్ప ఏనాడూ ప్రజా సమస్యలు పట్టించుకోలేదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచ్ ఆదినారాయణ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ ఉన్నా నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. సినిమాలపై ఉన్న శ్రద్ధ ఆయనకు హిందూపురం నియోజకవర్గ ప్రజలపై లేదన్నారు. పురం సమస్యలపై ఏనాడూ బాలకృష్ణ అసెంబ్లీలో తన వాణి వినిపించలేదని మండిపడ్డారు. ప్రజలు ఈ సారి మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.నారాయణస్వామి, ప్రభాకర్, చలపతి, మంజునాథ్, నిస్సార్, ఇర్ఫాన్, గోపాల్, మూర్తి, శ్రీరామిరెడ్డి, తిప్పన్న, శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: చిన్నపిల్లలను రెండు గంటల పాటు ఎండలో నిల్చోబెట్టి పూలు చల్లించుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణది పైశాచిక ఆనందం అని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి మండిపడ్డారు. మండుటెండలో నడిరోడ్డుపై పాఠశాల చిన్నారులను అంత సేపు నిలబెడితే ఎలా తట్టుకుంటారో ఆ మాత్రం తెలుసుకోలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారని ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల నుంచి ఎమ్మెల్యేగానే ఉన్న బాలకృష్ణ నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలు తిరిగారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీరు–చెట్టు , ఇసుక మాఫియాలో టీడీపీ నాయకుడు అన్సార్ ఎంత సంపాదించారో ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్లు హనుమంతరెడ్డి, దివాకరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రేపు సామాజిక చైతన్య సభ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 11న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.